30.

# ప్రేమయే మార్గము - ప్రేమయే గమ్యము

ప్రేమమయుడు శ్రీధరుడు ప్రేమయె అతని దివ్యరూపమౌ
ప్రేమయె సర్వమానవుల ప్రీతికి తారకమంత్ర మట్టి స
త్ప్రేమ రవంతయైన వివరింపగ లేక జగంబునందు త
త్కామిత సత్ఫార్థమెట్లు గాంచగ నేర్తురటయ్య మానవా?

ప్రేమస్వరూపులారా!

**ప్రేమమయా - భగవాన్**

శాంతము, సత్యము, దాస్యము, అనురాగము, వాత్సల్యము, మధురము ఇవన్నీ ప్రేమ పర్యాయపదములే. ప్రేమను మానవుడు ఎంత అభివృద్ధి గావించుకొనునో అతనికి అంత ఆనందము లభిస్తుంది. మానవుడు ఆనంద పిపాసి. నిరంతరము మానవుడు ఆనందమును ఆశిస్తుంటాడు. కారణం ఏమిటి? మానవుడు ఆనందమునందే పుట్టినాడు. ఆనందమునందే జీవిస్తున్నాడు. ఆనందమునందే అంత్యమవుతున్నాడు. ఈ ఆనందమే దైవ స్వరూపము. ఇట్టి దైవత్వాన్ని మానవుడు తనయందే ఉంచుకొని బయట ప్రపంచమందు వెతకటానికి ప్రయత్నిస్తున్నాడు. మానవుని వదలి ఏ ఆనందము ఎక్కడా లభ్యము కాదు. చదువులో ఆనందమున్నదని అనేకవిధముల శ్రమపడుతున్నాడు. ఉద్యోగములో ఆనందమున్నదని అనేక ప్రయత్నములు చేస్తున్నాడు. పదవులలో ఆనందము ఉన్నదని పదవి కోసమై అనేక విధముల ఆరాటపడుతున్నాడు. గృహస్థధర్మము నందానందమున్నదని తాను గృహస్థుడౌతున్నాడు. కానీ ఈవిధముగా ఎన్ని ప్రయత్నములు చేసినప్పటికి ఆనందమునకు మాత్రము అతను అత్యంత దూరమవుతున్నాడు. భగవంతునకున్న సమస్త నామములందు "సత్‌చిత్ ఆనందము" అనే నామము అత్యుత్తమమైన నామము. ఇట్టి ఆనందము మానవుడు పొందవలెనన్న ఈ సత్ చిత్ ఆనందమునే అనుసరించాలి. సత్ అనగా త్రికాలములందు, త్రిలోకముల యందు మారని

sri sathyasai vachanamrutam

సత్యమే సత్. అట్టి సత్‌ను మనము కనుగొనవలెనన్న సత్యమార్గమునందే దీనిని అనుభవించాలి. చిత్ అనగా పరిపూర్ణ జ్ఞానమే. ఇట్టి పరిపూర్ణ జ్ఞానము చేతనే పరమాత్మను పొందాలి. ఈ సత్‌చిత్ ఆనందము ఎక్కడ ఉండునో అక్కడే మానవునికి బ్రహ్మానందము ప్రాప్తిస్తుంది. మానవుడు దైవము పొందే నిమిత్తమై అనేక సాధనలు చేస్తున్నాడు. నానా విధములైన మార్గములననుసరిస్తున్నాడు. కానీ యివి కేవలము తాత్కాలిక తృప్తి నిమిత్తమే. ఇవి కాదు ఆనందమునందించేది. ఇవి ప్రాకృత సాధనలు. ఈ ప్రవృత్తి సాధనలు విరమించుకున్నప్పుడే నివృత్తి అయిన ఆనందము లభిస్తుంది. అట్టి నిత్యానందమును, అట్టి బ్రహ్మానందమును, అట్టి అద్వైతానందమును అనుభవించగోరువారు సత్‌చిత్‌ను అనుసరించాలి. ఇట్టి ఆనందము మనకు లభించవలెనన్న సత్యమార్గమునందే మనము ప్రవేశించాలి. సత్యమే ప్రత్యక్ష దైవము. ఈ సత్యము సర్వత్రా నిండినది. ఇది ఒక దేశమునకు, ఒక కాలమునకు, ఒక ప్రమాణమునకు చెందినది కాదు. కాలాతీతమైనది సత్యము. దేశాతీతమైనది సత్యము. గుణాతీతమైనది సత్యము. అట్టి సత్యమును అనుసరించినప్పుడే సత్ అనే ఆనంద స్వరూపుని పొందగలరు. దీనినే భగవద్గీత 'ఉద్ధరేదాత్మనా2త్మానాం' అని చెప్పింది. నిన్ను నీవు ఉద్ధరించుకో. నీ సత్యము నీవు గుర్తించుకో. నీ హృదయాన్ని నీవు పరిశీలించుకో. అందులో నీకు ఆనందము లభ్యమవుతుంది. కేవలం శరీరముతో చేసే కార్యములన్నీ తాత్కాలిక తృప్తి నందించేవే. ఈ దేహమునకు పిండము అని ఒక పేరు. Body is the temple of God. మానవునికి ఒక విధమైన అనుభూతినందించే మార్గము. ఈ temple అనే దేహమును భగవదర్పితం గావించటమే నిజమైన సాధన. మానవునకు ధర్మ అర్థ కామ మోక్షములు చతుర్విధ పురుషార్థములని చెబుతూ వచ్చారు. ఈ నాలుగు పురుషార్థములు ప్రవృత్తి మార్గమందు శాంతి సంతోషములను అందిస్తున్నాయి. ఈ ప్రాకృత జీవితమునకు శాంతి సుఖముల నందిస్తున్నాయి. భౌతికమైన లోకములో సుఖముల నందిస్తున్నాయి. కానీ యిది కాదు నిజమైన సుఖము. "**పరమ ప్రేమ**" అనే ఐదవ పురుషార్థము ఉన్నాది. భగవంతుని ప్రేమించే మార్గమునకు ప్రేమశాస్త్రము అని పేరు. ఈ ప్రేమ శాస్త్రమును ఎవరు చక్కగా అర్థము చేసుకోందరో అట్టివారికి అందులోనే ముక్తి లభిస్తుంది. ముక్తి అనగా ఏమిటి? తన

sri sathyasai vachanamrutam

జీవితమునకు ప్రవృత్తి మార్గమునందు ముక్తాయము గావించుకున్నదే ముక్తి. ఏది దైవార్పితము? భగవంతునకు ఏది మనము అర్పితము చేయాలి. దేవుడు నివశించే ఈ దేహమనే భవనమును, ఈ గృహమును, ఈ దేవాలయమును భగవంతునికే అర్పించాలి. దీనినే పితృ పిండము అన్నారు. పిండము దేహము. దానిని దైవమునకు అర్పించటమే ముక్తి. ఈ దేహముతో ఆచరించే సర్వకర్మలు దైవార్పిత భావముతో మనము చేయాలి. ఇదియే ఐదవ పురుషార్థమైన ప్రేమశాస్త్రము. ఇట్టి శాస్త్రము బోధించే నిమిత్తము, పవిత్రమైన ప్రేమను అందించే నిమిత్తము, ఈ ప్రేమను సర్వత్రా చాటే నిమిత్తము, ఈ మకరందమును గ్రోలించే నిమిత్తము, నిరాకారియైన భగవంతుడే గో లోకమునుండి భూలోకమునకు సాకార స్వరూపధారియై దిగి వస్తున్నాడు. అట్టి దిగివచ్చిన దినమునే దైవము యొక్క పుట్టిన పండుగ అని చెప్పుకుంటున్నాం. ఎందుకోసం వస్తున్నాడు భగవంతుడు. ఈ మాధుర్యాన్ని, ఈ మధురత్వమును మానవత్వానికి అందించి తద్వారా మత్తును కల్పించి, ఉన్మత్తుని గావించి, సదోన్మత్తుడు గావించుటకు వస్తున్నాడు. ఈ మాధుర్యమును భుజించిన వ్యక్తి కేవలం ఉన్మత్తుడై పోతున్నాడు. తాదాత్మ్యభావం పొందుతున్నాడు. దీనినే నారదుడు కూడా చెప్పాడు.

> **అమృతో భవతి, తృప్తో భవతి**
> **ఆత్మారామో భవతి.**

అని చెబుతూ వచ్చాడు. ఇట్టి మధురత్వము గ్రోలిన మానవుడు తాదాత్మ్య భావనలో మునిగి ఆ మాధుర్యమునునుభవించి, ఆ మకరందమును గ్రోలి తాను మాధవత్వమును పొందగలుగుతున్నాడు. దేహము కేవలం పాంచభౌతికమైన తత్వమును తెలుసుకునే నిమిత్తము కాదు. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం." ఎవరి కర్తవ్యమును వారు నిర్వర్తించాలి. కర్మఫలితము త్యజించాలి. భోగమునకు దూరము, త్యాగమునకు సమీపము కావాలి. అట్టి త్యాగస్వరూపుడే భగవంతుడు. అట్టి త్యాగమయుడే భగవంతుడు. అట్టి త్యాగానందమే భగవంతుని ఆనందము. భగవంతుని ఆనందమును అనుభవించగోరువారు, నిజమైన దేహాభిమానమును త్యజించి ఆత్మాభిమానమును అభివృద్ధిపరచుకొని ఈ ఆనందమును అనుభవించుటకు ప్రయత్నించాలి.

sri sathyasai vahanamrutam

**మానవుడు ఆనందస్వరూపుడు**

కాలమునంతయు దేహమునకే వినియోగించకూడదు. దేహమునకు కొంత అవకాశము నందించాలి. దేహాన్ని కూడా సంరక్షించుకోవాలి. దేనికోసం? దైవార్పిత నిమిత్తం దేహము మన కత్యవసరము. దైవార్పితము ఏమి చేయాలి? పరిపూర్ణ ప్రేమను మాత్రమే దైవమున కర్పించాలి. ఈ ప్రేమ ఎక్కడ నుండి పుట్టింది? దైవమే ప్రేమ (God is love). ఈ ప్రేమలోనే మనం జీవించాలి, నివసించాలి.

**నీటియందె పుట్టి నీటియందె పెరిగి**
**నీటియందడంగు నీటి బుడగ**

అదేవిధముగా మానవుడు ఆనందమునుండే పుట్టి ఆనందమునందే జీవించి ఆనందమునందే అంత్యము కావాలి. దేహము ఏనాటికైనా అనిత్యమైనదే. ఈ అనిత్యమైన దేహము నిమిత్తమే మనము కాలమును, కర్మలను, కాయమును కూడను అర్పితము గావించకూడదు. మనకు కావలసినది నిజమైన గుణము. ఈనాటి విద్యలందు కలిమి, బలిమి,చెలిమి సంపాయించుకొనుటకై తగిన ప్రయత్నము చేస్తున్నారు. కలిమి, బలిమి చెలిమి కాదు ప్రధానము. గుణము చాలా అవసరము. గుణము లేనివాడు ఎంత కలిమి సంపాదించినా వ్యర్థమే. కలిమిపోయినా ఫరవాలేదు, చెలిమిపోయినా ఫర్వాలేదు. గుణమును మాత్రం పోషించుకోవాలి. ప్రాచీనకాలమందు భారతీయులు అనేక సాధనలు చేసి If wealth is lost nothing is lost, if health is lost something is lost. If character is lost every thing is lost అన్నారు. కానీ కలియుగ ప్రభావము చేత యీనాడు if character is lost nothing is lost, if Health is lost something is lost, if Wealth is lost everything is lost లాగా మారింది. ఇది యీనాటి రివర్సు ప్రయాణం. ఇది కాదు సరియైన ప్రయాణము. Character is lost everything is lost. గుణమే లేని వానికి స్థలమే లేదు జగత్తులో. కనుక గుణమును పోషించుకోటానికి తగిన కృషి చేయాలి. ఇట్టి పవిత్రమైన గుణపోషణ నిమిత్తమై కృష్ణుడు అనేక రకములైన ప్రబోధలుసల్పుతూ జగత్తునకు చాటి తన తత్త్వాన్ని తాను అనుభవింపచేసి ఆదర్శము నిరూపిస్తూ వచ్చాడు. Prof. ఛటర్జీ చెప్పాడు.



sri sathyasai vachanamrutam

వర్షమును భరించుకొనలేక గోకులవాసులు అందరు బాధపడుచుండగా గోవర్ధనగిరి ఎత్తటానికి వెళ్లాడు కృష్ణుడు. మానవులకు కాలి మొదలుకొని తల వరకు సందేహములే. ఆపాదమస్తకము అనుమానములతో కూడి ఉంటాడు మానవుడు. రండి, ఈ పర్వతము క్రింద కూర్చోండి సంరక్షిస్తానని కృష్ణుడు చెప్పుతూ ఉండినా ప్రజలందరు

**బాలుండీతడు కొండ దొడ్డది మహాభారంబు**
**ఈతండు మోయంగజాలునా**

అని అనుమానించారు. ఈవిధముగా దేహ ప్రమాణముల నాధారము చేసుకొని బలప్రమాణములు విచారించేవారు మానవులు. దేహప్రమాణములు లెక్కచేయక గుణ ప్రమాణమునే లక్ష్యము నందుంచుకొనేది దైవత్వము. భగవంతుని ప్రేమకు లోక మానవుని ప్రేమకు ఉండిన వ్యత్యాసము గుర్తించుటకు ప్రయత్నించాలి.

**ఇచ్చుటే గాని పుచ్చుకొనుట ఎరుగడు**

ఈనాటి మానవుడు ప్రేమను అందుకొనుటకై అనేక ప్రయత్నములు చేస్తుంటాడు. మానవుడు ఎప్పుడూ అందుకొనుటకే సిద్ధముగా ఉంటాడు. కానీ భగవంతుని ప్రేమ అట్టిది కాదు. యిచ్చేదే భగవంతుని ప్రేమ. పుచ్చుకొనేది కాదు. పుచ్చుకొనే హస్తము కేవలము క్రింద ఉంటుంది. ఇచ్చుకునే హస్తము పైన ఉంటుంది. కాబట్టి భగవంతుడెప్పుడు ఉన్నతస్థాయిలో ఉండేవాడేగానీ అధోస్థాయిలో జీవించేవాడు కాదు. ఏది చేసినా, ఏది చూచినా ఏది చెప్పినా, అన్నింటియందు స్వార్థరహితమైన కర్మలే ఆచరిస్తుంటాడు భగవంతుడు. ఎక్కడ వెదకినా భగవంతుని దగ్గర స్వార్థమే లేదు. స్వప్రయోజనమే లేదు. మానవుడు స్వార్థము, స్వప్రయోజనమే యావజ్జీవితము అని భావిస్తున్నాడు. స్వార్థమును ఏనాడు త్యాగము చేస్తామో ఆనాడే పరార్థమనేది ప్రత్యక్షమవుతుంది. ఏమిటి ఈ స్వార్థము? స్వార్థమంటే ఏమిటి? దీని ఫలితము ఏమిటి? దీని గమ్యమేమిటి? దీని ఆనందమేమిటి? దీనికి గమ్యమే లేదు. దీనికి ఆనందమే లేదు. కేవలం భ్రమచేత మానవుడు దీనిలో చిక్కిపోతున్నాడు. ఈ దేహము చేత కలిగే సమస్త కర్మలు అశాంతిగానీ, శాంతిగానీ, ఫలితము లాభముగానీ, నష్టముగానీ అన్నీ అస్థిరంగా కదలిపోయేవి. ఇవన్నీ క్షణికమైనవే.

srisathyasaivachanamrutam

ఇలాంటి దీనికోసమై శాశ్వతమైన ఆనందమును ఎందుకోసం పోగొట్టుకుంటున్నారు? ఈ శాశ్వతానందమని తెలియకపోవటం చేతనే యీ విధమైన అస్థిరమైన వాటికోసం పాటుపడుతున్నారు. శాశ్వతమైన సత్యాన్ని మనం గుర్తించుకున్నప్పుడు ఈ అశాశ్వతాన్ని మనం లెక్కనే చేయం. ప్రతిపనియందు సత్యాన్ని మనం విచారణ చేయాలి. ఈ సత్యాన్ని గుర్తించిన వ్యక్తి నిరంతరము ఆనందము లోనే జీవిస్తుంటాడు. ప్రేమయే సత్యము. ప్రేమయే జీవితము. ప్రేమయే గమ్యము. ప్రేమకు ప్రేమ తప్ప అన్య పదార్థములు సాటిరావు. కనుక ప్రేమకు సాటి ప్రేమయే. ఇలాంటి ప్రేమచేతనే ప్రేమ స్వరూపుని పొందటానికి ప్రయత్నించాలి. కానీ లౌకికమైన ప్రేమ కాదు. భౌతికమైన ప్రేమ కాదు. కేవలం ప్రాకృతమైన ప్రేమకాదు. ఇది ప్రవృత్తి ప్రేమ కాదు. ఇది నిత్య సత్యమైన నివృత్తి ప్రేమయే దైవప్రేమ. ద్వేషముతోనైనా, ప్రేమతోనైనా, కష్టముతోనైనా, బాధలచేతనైనా, దూషణతోనైనా భగవంతుని ప్రేమను పొందవచ్చు. నిండుసభలో శిశుపాలుడు కృష్ణుని అనేక విధములుగా దూషిస్తూ వచ్చాడు. వినరాని మాటలు వినిపించాడు. ఆ సభలోనున్న ధర్మజుడు భరించుకోలేకపోయాడు, కృంగిపోయాడు, కృశించిపోయాడు. ఏవిధమైన తలంపులు లేని స్థితిలో నిల్చిపోయాడు. ఈ దూషణలు వింటూ ఉండగనే ఆ శిశుపాలుని ప్రాణము వచ్చి భగవంతునిలో చేరిపోయింది. ఇది మరింత అసంతృప్తి కార్యముగా తోచింది. ఈవిధముగా దూషించిన దుర్మార్గుని ప్రేమ యిదియా! భగవంతుని దూషించిన వాని ప్రేమ యీవిధంగా ఐక్యమవుతుందా? అని సందేహిస్తూ వచ్చాడు. ధర్మజుడు అగ్రతాంబూలమిస్తున్నాడు కృష్ణునికి. ఇంత మంది మహర్షులుండగా యీ గొల్లపిల్ల వానికా నీవు తాంబూలమందించటం, అని చాలా విమర్శించాడు. ఆ విమర్శ భరించలేక పక్కనే ఉన్న నారదుని ప్రశ్నించాడు ధర్మజుడు. 'నారదా! దూషణ చేసినవాడు కూడా భగవంతునిలో ఐక్యమవడం యొక్క అంతరార్థము గూర్చి నాకు కొంత బోధించమని' అడిగాడు. రాజభూషణా! దూషణ భూషణ తిరస్కారములన్నీ దేహమునకే గానీ ఆత్మకు కాదు. శిశుపాలుడు ప్రేమచేత దూషిస్తున్నాడు గానీ ద్వేషము చేత కాదు. ఎంత దూషిస్తే అంత త్వరగా భగవంతునిలో చేరుతాడు. అతని శాపము ఆవిధంగా ఉన్నాది. కనుక అతడు అనేకరకములుగా దూషించాడు కృష్ణుని. ప్రేమచేత భగవంతుని దూషించినా దోషము

sri sathyasai vachanamrutam

లేదు. ఆ దూషణ కూడా ఒక భూషణే. తిరస్కారము కూడా ఒక భూషణే. పురస్కారముకూడా ఒక భూషణే. ఇలాంటి ప్రేమతత్వాన్ని ఆనాడు భగవంతుడు అందిస్తూ వచ్చాడు. కంసుడు ఈ కృష్ణునిచేత తన ప్రాణములు కోల్పోతాడని విని ఏవిధంగానైనా బలరామకృష్ణులను హతమార్చాలనే సంకల్పముచేత తాను కూడా దూషిస్తూ వచ్చాడు. అక్రూరుని పంపించాడు. 'అక్రూరా! నీవు కృష్ణుని స్నేహితుడవు. నీవు కృష్ణుని పరమ భక్తుడవు. నీవు వెళ్లిన తప్పక బలరామకృష్ణులు రాగలరు. తప్పక వెళ్లాలనీ శాసించాడు. రాజాజ్ఞను తిరస్కరించలేక అక్రూరుడు బయలుదేరాడు. యశోదా నందులకు బోధించి 'అమ్మా కంసుని యాగము చూడటానికి బలరామకృష్ణులను తీసుకుపోతున్నాని అన్నాడు. అంగీకరించక తప్పదన్నాడు. కానీ యశోదా నందులకు ఏమాత్రము యిష్టము లేదు. యీ విషయము గుర్తించిన గోపికలు నందుని యింటివద్ద చేరారు. బలరామకృష్ణులు పోవటానికే వీలు కాదు. మా ప్రాణ స్వరూపుడు. మా జీవస్వరూపుడు, మా కర్మ స్వరూపుడు కృష్ణుడు. అతన్ని వదలి ఒక్క క్షణమైనా ఉండలేము. మధురకు పోవటానికి వీలుకాదు అని అనేక విధములుగా ఆటంకములు చెబుతూ వచ్చారు. లీలామానుష విగ్రహుడు కృష్ణుడు. ఈ గోపికలు జవాబు ఏమాత్రము అంగీకరించరు. రథములో కూర్చున్నాడు. గోపికలకు ఈ రథము కనిపించకుండా చేశాడు. తన మాయాశక్తి వల్ల రథమే కనిపించలేదు. యశోదానందులకుగానీ, గోపికలకుగానీ యమునా తీరము పోయేంతవరకు రథము కనిపించలేదు. గోపికలు చేయునది లేక బృందావనము వెళ్లారు. యద్భావం తద్భవతి అని తమ యొక్క ప్రేమ ఎటువంటిదో అలాంటి ప్రేమయే సర్వులయందు ఉంటున్నదనే భావము గోపికలది. వారిది పవిత్రమైన ప్రేమ. నోరులేని వృక్షములను, కన్నులు లేని పర్వతములను అన్నింటిని పలుకరిస్తూ పోతున్నారు. జవాబు చెప్పటానికి నోరు లేదు, చూడటానికి కన్నులు లేవు. అలాంటి పూలపొదలనన్నింటిని ప్రశ్నిస్తూ వస్తున్నారు గోపికలు. పూలనుకూడా ప్రశ్నిస్తూ వస్తున్నారు. ఏమని ప్రశ్నిస్తూ వస్తున్నారు?

**నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై**
**జల్లెడివాడు మౌళి పరిసర్పిత పింఛము వాడు నవ్వు రా**
**జిల్లెడు మోము వాడొకడు చెల్వల మానధనంబుదోచెనో**

sri sathyasai vahamrutam

**మల్లియలారా! మీ పొదలమాటున లేదుగదమ్మ చెప్పరే.**

మా సర్వము దోచుకొనిపోయాడు. అతడు మీ పొదలచాటునేమైనా ఉన్నాడా? చెప్పండి అని ప్రశ్నిస్తూ పోయారు గోపికలు. అదికూడా ప్రేమయొక్క లక్షణమే. ఒకవైపున కంసుని తీసుకొనిపోయేది ప్రేమ యొక్క లక్షణమే. ఎడబాటును భరించుకొనలేక బాధపడేది ప్రేమ లక్షణమే. అన్నీ ప్రేమతో కూడినవే. ఈ ప్రేమకు కారణమే లేదు. ప్రేమకు ప్రేమయే కారణము. ఈ ప్రేమచేతనే మనము భగవంతుని పొందాలి. ఎన్ని సాధనలు చేసినా యివి తాత్కాలిక తృప్తి మాత్రమే అందిస్తాయి గానీ శాశ్వతమైన ఆనందము చేకూర్చవు. ఈ విధమైన ప్రేమ తత్వముచేతనే భగవంతుని, ప్రేమ స్వరూపుని పొందాలి. ఈ ప్రేమ ఎక్కడుంది? మనయందే ఉంది. మనయందున్న దంతా ప్రేమయే. ఆ ప్రేమను అనేక మార్గములలో మనము ప్రసరింప చేస్తున్నాము. అనేక విధములైన వాంఛలచేత యీ ప్రేమను అనుభవిస్తున్నాం. మార్గములు వేరు గానీ ప్రేమ ఒక్కటే. అనేక మిఠాయిలు చేస్తుంటారు. మైసూర్‌పాక్, గులాబ్‌జాం, పాలకోవ, బర్ఫీ మిఠాయి ఇవన్నీ చేస్తుంటారు. అన్నింటియందుండిన చక్కర ఒక్కటే. ఆ దివ్యత్వమనే ప్రేమయే సర్వులయందు దాగి ఉంటున్నది. ఈ ప్రేమలేని హృదయమే జగత్తులో కానరాదు. సర్వుల యందున్న ప్రేమతత్వాన్ని ప్రత్యక్షం గావించుకోవాలి. ఈ మార్గము బోధించే నిమిత్తమై కృష్ణుడవతరించాడు. అదే చెప్పాడు.

**కృష్ణావతారం-ముఖ్య ఉద్దేశ్యము**

**యథా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానాం సృజామ్యహమ్.**

ఈ అధర్మము పెరిగిపోవటంచేత, ప్రేమ లేని వ్యక్తులు అధికులవడం చేత ఈ జగత్తంతా అనేక విధములుగా కంపించిపోతున్నాది. ప్రేమను నాటి, ప్రేమను అభివృద్ధిపరచి, ప్రేమను ప్రకటింప చేసి, ప్రేమను అనుభవింపజేయటానికి వస్తున్నాను అన్నాడు కృష్ణుడు. భగవంతునికి మరొక పని లేదు. మానవుని యందున్న ప్రేమను అభివృద్ధిపరచేది. ప్రేమ మాధుర్యము వారికి చవి చూపించేది. ఆ ప్రేమ మాధుర్యము చేత వానిని ఉన్మత్తుని

గావించేది. అదియే జీవన్ముక్తికి మార్గము. సత్‌మార్గములో మనం ప్రయాణం చేయాలి. సత్య మార్గములో మనం ప్రయాణం చేయాలి. పరిపూర్ణజ్ఞానములో మనం జీవించాలి. అప్పుడే పరిపూర్ణ స్వరూపుడైన పరమాత్మ ప్రత్యక్షమవుతాడు. దేవుడెక్కడో లేడు.

**దేవుడి అడ్రసు**

**దేవుడనగ వేరు దేశమందున లేడు**
**దేవుడుండు తనదు దేహమందే**

ఏ దేశమునందో దేవుడు లేడు. ప్రతి దేహమందు దేవుడున్నాడు. అట్టి పరమాత్మ తత్వాన్ని ఎందుకు అన్వేషణ చేయాలి? తనయందే ఉన్న పరతత్వాన్ని బయట ప్రపంచములో వెతకటమెందుకు? భగవంతుడు ఆనందమయుడు. అతనే

**నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం**
**ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణరహితం.**

అట్టి ఆనందము ప్రతి మానవునియందు ఉంటున్నది. అయితే యిది ఎట్లు మనకు ప్రత్యక్షమౌతుంది? ఒకే జ్యోతి ఉన్నది. ఆ జ్యోతిపై ఒక కుండను బోర్లించాము. ఆ కుండకు పది చిల్లులున్నాయి. ఈ పది చిల్లులపై దట్టమైన టర్కీ టవలు కప్పాము. లోపలున్న జ్యోతి వెలుగుతున్నది కానీ టవలు కప్పటం చేత కనిపించటం లేదు. దేహమే ఒక కుండ. లోపల జ్యోతియే ఆత్మ. ఈ దేహమునకు పది చిల్లులున్నాయి. దీనిపైన భ్రమ అనే రగ్గు కప్పుకున్నారు. మొట్టమొదట తమోగుణమైన రగ్గు తీసివేయి. అప్పుడు పది జ్యోతులుగా కనిపిస్తుంటాయి. తిరిగి దేహమనే కుండను మనం బద్దలు చేయాలి. అప్పుడు ఒకే జ్యోతి కనిపిస్తుంది. "ఏకంసత్ విప్రా బహుధా వదంతి." ఉన్నది ఒక్కటే. ఉన్నది ఒక్కటైనా యింద్రియముల ద్వారా అనేక రకములుగా గోచరిస్తున్నాది. ఏకజ్యోతియైన దివ్యజ్యోతి అన్నింటియందు ప్రత్యక్షము చేసుకోవాలి. అనేకత్వము లోని ఏకత్వము మనం దర్శించాలి. ఎన్ని బల్బులు ఉండినా, ఎన్ని రకములైన ఓల్టేజిలుండినప్పటికిని కరెంటు ఒక్కటే. ఒక్కొక్క

sri sathyasai vachanamrutam

దేహము ఒక్కొక్క బల్బు వంటిది. వారి వారి శక్తి ఆ కెపాసిటీ వంటిదే. అన్నింటియందు దివ్యమైన ఆత్మతత్త్వము ఒక్కటిగానే ఉంటున్నాది. ఇలాంటి ఏకత్వమును దర్శించటానికి మనం తగిన కృషి చేయాలి.

**శ్రవణం కీర్తనం విష్ణుస్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం స్నేహమాత్మ నివేదనం**

ఈ నవవిధమైన మార్గములలో ఏదో ఒక మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఇవన్నీ దేహభ్రాంతి ఉండినంతవరకే. దేహభ్రాంతి కలవారికే ఈ భ్రాంతులు. దేహభ్రాంతి లేనివారికి ఈ సాధన అక్కరలేదు. నేనే దైవము. దైవమే నేను అనే సత్యాన్ని గుర్తించుకున్నవాడు అన్ని సాధనలు విరమిస్తాడు. నిజమైన ఆత్మతత్త్వము ఒక్కటే. అదే conscience. అదే నేను చెబుతుంటాను అప్పుడప్పుడు. You are not one person but three. The one you think you are, the physical body. The one others think you are, the mental body. The one you really are, that is atma. దానిని లక్ష్యము చేసుకోవాలి. దానినే మనం సాధించాలి. ఈ దేహాన్ని ఏ మాత్రం సాధించనక్కర్లేదు.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెన్నడున్**
**దేహి నిరామయుండు గణుతింపగదేహికి చావు పుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడగా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ.**

**మలినపు కొంప రోగములమ్రగ్గెడు సేవకగంప జాతిసం**
**చలనము పొందు దుంప భవసాగరమీదగ లేని కంప అం**
**బులపొదిలెమ్ము చూడ మన మెప్పుదలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరిపాదము లాశ్రయింపవే!**

**నిజమైన విజయం ఏది**

ఇవన్నీ వస్తుంటాయి, పోతుంటాయి. ధనకనక వస్తువాహనాదులంతా కదలిపోయే మేఘములే. ఏది కూడా శాశ్వతమైనది కాదు. మనం చేసే కర్మలే పవిత్రమైనవి.

sri sathyasaivachanamrutam

"కర్మణ్యేవాధికారస్య" అని భగవద్గీతలో చెప్పారు. ఎవరు ప్రధానమైన విజయుడు? ఒకానొక సమయంలో కృష్ణుడు ప్రశ్నించాడు. ఎవడు విజయుడు? చుట్టూ ఉన్న బాలురు చెప్పారు. యుద్ధములో విజయము సాధించినవాడు విజయుడు అని. కష్టములు ఎదుర్కొన్నవాడు విజయుడన్నారు. దుఃఖములు ఎదుర్కొన్నవాడు విజయుడు అని ఒక్కొక్కరు ఒక్కొక్క సమాధానము చెబుతూ వచ్చారు. అప్పుడు కృష్ణుడు నవ్వుతూ గోపబాలురా! విజయుడు అంటే వీరుడు కాదు. యిది తాత్కాలికము. నిజమైన విజయము ఏమిటి? యింద్రియ నిగ్రహమే నిజమైన విజయము. అప్పుడే విజయము సాధించినవాడౌతాడు. ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. ఇంద్రియాలు దేహమునకు సంబంధించినవే. కానీ దేహమును కూడా భగవంతుని గృహంగా మనం విశ్వసించాలి. ఇంక దైవ స్వరూపాన్ని ఏవిధంగా వారు వర్ణిస్తూ వచ్చారు? ఎవరు నిన్ను వర్ణించలేరు కృష్ణా.

**నిను గనుగొనగలమా! కృష్ణా! నిను గనుగొనగలమా?**
**అణువుకంటె అతి సూక్ష్మస్వరూపుడవు**
**ఘనము కంటె అతి ఘననీయుడవు**
**ఎనుబది నాలుగు లక్ష జీవముల అనయంబున**
**నెడబాయకుందువట**
**అణువురేణు తృణ కాష్టము మొదలగు అఖండ రూపుడవై**
**వెలయుదువట నిను కనుగొనగలమా?**

నిన్ను ఏరీతిగా కనుక్కోగలరు? వీలుకాదు. ప్రేమస్వరూపునిగా మాత్రమే కనుక్కోవాలి. సత్యస్వరూపునిగా గుర్తించాలి. ప్రేమను వదలకుండా సాధించాలి. అప్పుడే సర్వేంద్రియములు నిగ్రహించిన వారవుతారు. యింద్రియ నిగ్రహము అంటే ఏ సాధనలో, ఏ కసరత్తులో ఏ exercise లో చేసి యింద్రియములు నిగ్రహించుటకు సాధించుటకు వీలుకాదు. యివన్నీ తాత్కాలికమైనవి. శాశ్వతమైన విజయము సాధించాలనుకుంటే ప్రేమచేతనే సాధించాలి. సత్యము చేతనే సాధించాలి. సత్యం వద. ధర్మం చర. సత్యమును మేలుకొలుపు చేసుకుంటే సత్యము ద్వారానే సర్వస్వాన్ని పొందగలుగుతాం. దీనినే వేదాంత

sri sathyasai vachanamrutam

మందు ఉత్తిష్ఠత జాగ్రత్త ప్రాప్తవరాన్ని బోధత అన్నారు. అజ్ఞానములో నిద్రపోయే మానవుడా! లెమ్ము లెమ్ము లెమ్ము. ప్రజ్ఞానమనే జ్యోతి వెలిగింపుము. నీ అజ్ఞానము దూరము చేసుకో. దివ్యాత్మను నీవు అనుభవించమని చెప్తుంది. నీలోనే ఉన్నది అజ్ఞానము. ఈ అజ్ఞానము ప్రాకృత వాంఛలచేత కలిగేదే. "నేను, నాది" అనుకోటమే పెద్ద దుఃఖము. నాది కాదు అనుకోటమే సుఖము. ఏదీ నాది కాదు. నేనెవరు? నేనెవరో నాకే తెలియదు. నాది అని నేను ఎట్లా చెప్పగలను. ఇది ఒక భ్రాంతి. నాది అనేది లేదు. నేను అనేది లేదు. నాది, నేను అనే అభిమానమే సర్వ దుఃఖములకు మూలకారణము. ఈ రెండింటిని దూరం చేసుకోటానికి ప్రేమతత్వం మనం పెంచుకోవాలి. ఎలాంటి పరిస్థితులందు మనం ప్రేమ వదలకూడదు. ప్రేమచేత దేనినైనా సాధించటానికి వీలవుతుంది. ఈ ప్రేమ చేత విశ్వాసము లభిస్తుంది. భగవంతుడు ప్రేమ స్వరూపుడే. Love is god-Live in love. ఈ ప్రేమను మనం తెలుసుకోటానికి ప్రయత్నించాలి. ఈ ప్రేమ ఒక్క భగవంతుని దగ్గర తప్ప అన్యుల దగ్గర మనకు కనిపించదు. అంతో యింతో స్వార్థమనేది వారిలో చేరి ఉంటుంది. భగవంతునిలో కించిత్తు కూడా స్వార్థము కనిపించదు. కారణం ఏమిటి? నాది, నేను అనేది లేదక్కడ. అంతా నేనే. నాది అనే రెండవ వస్తువు ఉంటే కదా! ఉన్నది ఒక్కటే. "ఏకం సత్ విప్రా బహుధావదంతి." అనేకమంది అనేకరకములుగా చెప్తుతుంటారు. ఒకటి పెట్టి సున్నాలు పెడితే మిలియన్సు మిలియన్సుగా మారిపోతుంది. ఒక్కటి లేక ఎన్ని సున్నాలు పెట్టినా అవన్నీ జీరోలే. ఆ ఒక్కటే హీరో. అతడే భగవంతుడు. Hero becomes zero, if he forgets god. Heroను మరచిపోతే అంతా జీరోయే. హీరో అనే దైవమును మరువకూడదు. ఈ ప్రపంచమునకంతా అతనే ఆధారము. ఆ ప్రేమయే మూలకారణము.

**ప్రేమరహిత మరుభూములలో**
**ప్రేమాంకురములు పెంపొంద**
**ప్రేమావేశముతో ప్రేమసుధా వర్షము వర్షింపగ**
**ప్రేమనదులు ప్రవహింపగ మురళీగానము చేయగదే కృష్ణా**

అన్నారు గోపికలు

sri sathyasai vachanamrutam

**మోక్షమనగా నేమి**

అంతా ప్రేమయే. నదులు ప్రేమయే. వర్షము ప్రేమయే. భూమి ప్రేమయే. మొక్కలు ప్రేమయే. ఫలములు ప్రేమయే. అంతా ప్రేమమయము. ఇలాంటి ప్రేమమయమైన మానవజన్మము వచ్చికూడ ఎందుకు ప్రేమ రహితులుగా అవుతున్నారు. ఈ ప్రేమను ప్రాకృతమైన దానిలో ప్రవేశ పెడుతున్నారు. అది ఎప్పుడు నిజమైన ప్రేమగా మారిపోతుంది? ఈ దేహమనే కళేబరమును భగవంతునికి అర్పితము గావించాలి. ఇదియే నిజమైన అర్పితము. అనేకమంది అనేక పదార్థములు అర్పితము చేస్తుంటారు. కానీ నిజమైన భక్తుడు తన దేహాన్నే అర్పితము చేసుకుంటాడు. బలిచక్రవర్తి తన దేహమునే అర్పితము చేసుకున్నాడు. అప్పుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు భగవంతుడు. ఇంక అతనికి జన్మమే లేకుండా పోయింది. ఈ దేహమును భగవంతునికి అర్పితము గావించుకునే నిమిత్తమై వచ్చిన వరప్రసాద పుష్పమని భావించాలిగానీ వేరు విధముగా భావించకూడదు. మనము ఈ వచ్చిన జీవితాన్ని సాధ్యమైనంతవరకు సత్కర్మల చేతను, సదాచారముల చేతను, సత్ప్రవర్తన చేతను అనుభవింపజేసి కట్టకడపటికి భగవంతునికి అర్పితము చేయాలి. పిండార్పణ అని చెబుతూ వచ్చారు. చాలా మంది బ్రాహ్మణులు పితృపిండము అని అనుకుంటున్నారు పిండార్పణమంటే. అది పిండార్పణము కాదు. పిండమనగా దేహమే. ఈ పిండమనే దేహమును భగవదర్పితం చేయటమే పిండార్పణ. దీనిని భగవదర్పితము గావించినప్పుడు అదే నిజమైన మోక్షము అదియే ముక్తి. మోక్షమనగా నేమి? ఎప్పుడు ఈ దేహాన్ని అర్పితం చేశావో మోహమే ఉండదు. ఎప్పుడు మోహక్షయమో అప్పుడు మోక్షము. మోహం లేదు. క్షయమైపోయింది. అదే మోక్షము. ఈ విధమైన సత్యాన్ని గుర్తించి వర్తించిన వ్యక్తులు ఎంతైనా ఆనందమును అనుభవించవచ్చు. అయితే అట్టి పవిత్రమైన స్థితికి వచ్చేంతవరకు దేహాన్ని కాపాడుకోవాలి. ఈ ప్రకృతిలో మనం కొన్ని కార్యములు చేయాలి. కర్తవ్యములు నిర్వర్తించాలి. ధర్మాన్ని ఆచరించాలి. సత్యాన్ని అభివృద్ధిపరచు కోవాలి. త్యాగాన్ని పోషించుకోవాలి. ప్రాచీన కాలమందే మన భారతీయులు చేసిన పని. అనాది కాలమునుండి భారతీయ హృదయము కరుణతో నిండినది. అనేక పర్యాయములు

sri sathyasaivachanamrutam

చెప్పాను విద్యార్థులకు. మాక్స్‌ముల్లర్ అని విదేశీయునికి భారతదేశముపైనున్న విశ్వాసము యింత అంత అని చెప్పటానికి వీలులేనిది. కట్టకడపటి స్థితిలో తాను భారతదేశము వచ్చి శరీరము వదలాలని సంకల్పించు కున్నాడు. కారణం ఏమిటి అని అనేకమంది మిత్రులు ప్రశ్నించారు. భారత దేశములో ఏమిటున్నాది? అప్పుడు తాను చెప్పాడు. **"భారతదేశము గాలిలో సత్యముంటున్నది, ధూళిలో ధర్మము ఉంటున్నది, మట్టిలో ప్రేమ ఉంటున్నది, గంగలో త్యాగముంటున్నది. ఇలాంటి పవిత్ర భారతదేశములో కాక నేను ఎక్కడ పోవాలి. ఇలాంటి పవిత్రమైన దేశము మరొకటి లేదు. ఎన్న భారతే తన్న భారత. భారతదేశములో లేనిది ఏ దేశములో లేదు"** అన్నాడు. అలాంటి భారత దేశములో మనం పుట్టి భారతీయులమని అనిపించుకొని, భారతీయ విశ్వాసాన్ని మనం గుర్తించుకోలేకపోతున్నాం. ఈ భారతదేశ పవిత్ర చరిత్ర మనం గుర్తించుకోవాలంటే మనము చాలా పాటుపడాలి. ఆనాటి మన ప్రాచీనులందరు అనేక సాధనలు చేశారు. ఆనాడు వారు సాధించి అందించిన సుధానిధియే ఈనాటి ప్రేమభక్తియనే వెన్న. కానీ ఈ ప్రేమ ఎక్కడనో ఉంటుంది. అందుకోసమే గోపికలకు చెప్పింది యశోద.

**మాయా మానుష - వేషధరుడు - శ్రీ కృష్ణుడు**

**'కృష్ణా' పెట్టినది తినవు, నే పెట్టినది తినవు**
**గొల్లల పట్టెలకుంబోయి వెన్న లో గుట్టుగా తినెదవు**
**నీతో పుట్టెను రట్టెల్ల కృష్ణా**
**నోరంత వెన్న వాసన ఎంతయో ఆగడంబు ఒకటేరటు**
**గోరంత లేవు బాల గారాబాము మానుమింక?**

ఇంత చిన్నపిల్లవాడవు ఊరంతా రట్టు చేస్తున్నావు కృష్ణా! మన యింటిలో లేదా వెన్న. కావలసినంత వెన్న ఉంటున్నాది. ఎందుకు నీవు తినకూడదు. ఎందుకు యితరుల యింటికి పోయి దొంగతనంగా తినాలి. అప్పుడు చెబుతాడు కృష్ణుడు. అమ్మా! యింటి వెన్న బయట వెన్న అని వెన్నకు భేదము లేదు. వారి హృదయమే పవిత్రమైన వెన్న, అతి మధురమైన

srisathyasai vachanamrutam

వెన్న, అది చాలా మెత్తని వెన్న. కానీ నీ పుత్ర వాత్సల్యముచేత కఠినంగా ఉంటున్నది నీ వెన్న అని అన్నాడు. ఎందుకంటే పుత్ర వాత్సల్యము ఉంటున్నది. గోపికలకు ఎట్టి వాత్సల్యము లేదు. ప్రేమ మధురమైనది. మధురమైన వారి హృదయములు పవిత్రమైనవిగా, అతి రుచిగా మెత్తనివిగా ఉంటున్నాయి. ఒకనాడు బలరామకృష్ణులకు కొంతవరకు పోరాటము జరిగి బలరాముడు కొంతమంది గోపబాలురను తీసుకువచ్చి కొన్ని తంటాలు చెబుతాడు. అమ్మా! ఏమి కృష్ణుడు యింత ఆకలిగొన్నాడా? యింటిలో తింటాడు బయట తింటాడు. ఎక్కడ చూచినా తిండి తిండి. తిండి తింటూనే ఉంటున్నాడు. కానీ మట్టి ఎందుకు తినాలి. ఈనాడు మట్టి తిన్నాడు అన్నాడు. యశోదకు చాలాకష్టం కలిగింది. కోపం వచ్చింది. చెవి పట్టుకుంది. ఏమి కృష్ణా మట్టి తింటానికి కారణం ఏమిటి? నన్ను అడిగితే కావలసినంత భోజనం పెట్టలేనా! గోపికల యిండ్లలో కావలసినంత వెన్న తినటం లేదా? యింటిలో భోజనము చేసి కూడా నీవు మట్టి తినటంలో అంతరార్థము ఏమిటి అడిగింది. అప్పుడు చెబుతున్నాడు పాపం. తల్లీ **'అమ్మా మన్ను తినంగ నే శిశువునా, ఆ కొంటినా వెఱ్ఱినా...'** నేను చిన్నపిల్లవాడను కాదు, వెఱ్ఱివాడను కాదు. అనగా తాను గొప్పవాడనని మాటలలోనే వ్యక్తము చేస్తూ వచ్చాడు. 5వ సంవత్సరముల బాలుడు. కానీ నేను చిన్న పిల్లవాడిని కాదనే సత్యాన్ని చక్కగా ప్రత్యక్షం గావించాడు. నేను పిచ్చివాడను కాదు. నేను గొప్పవాడను అని మర్మముగా తెలియపరిచాడు. యిలాంటి అనేక అంతరార్థములు ప్రబోధిస్తూ చిన్న వయస్సునందు పవిత్రభావాలు జగత్తునందు చాటుతూ వచ్చాడు. కృష్ణుని యొక్క లీలలు గానీ, కృష్ణుని యొక్క చర్యలుగానీ దైవము యొక్క అంతరార్థములు ఎవరూ గుర్తించుకోలేరు. బాహ్యంగా కొన్ని అర్థములు, అంతరముగా కొన్ని అర్థములు ఉంటాయి. ఈవిధమైన అంతరార్థములు గుర్తించుకునే వ్యక్తులు ఈనాడు కరవైపోయారు. అందువలనే అనేక సందేహాలతో సతమతమవు తున్నారు. కంటితో చూచినా doubts వస్తున్నాయి యశోదతల్లికి. తల్లికే సందేహాలు. నోరు తెరచినప్పుడు అనేకము చూసింది. అన్ని లోకములు కనిపించాయి. భయపడుతున్నాది.

**'కలయో, వైష్ణవమాయయో యితర సంకల్పార్థమో సత్యమో**
**తెలుపన్ నేరకో యున్న దానను, యశోదా దేవిగానో**



sri sathyasai vacharamrutam

ఎందుకీ విధంగా భ్రమలొస్తున్నాయి అని నోటిలోని పదునాల్గు లోకములు చూచి భ్రమించిపోయింది పాపం. తన కంటితో చూచికూడా తాను నమ్మలేకపోయింది. దీనికి మూలకారణం ఏమిటి? వాత్సల్యమే నా కుమారుడు, నా కుమారుడు. ఈ శరీరక సంబంధమైన attachment యిన్ని సందేహములకు మూలకారణము.

**నమ్మిచెడిన వారు లేరు.**

ఆత్మ attachment కావాలి. ఆత్మ ఆత్మలో ఏకమైనప్పుడు సర్వము ఏకమై పోతుంది. అట్టి ఆత్మకు ఆత్మ సంబంధమే ఆధ్యాత్మికము. దేహానికి సంబంధమైనది భౌతికమే. యిలాంటి అనేక సందేహాలను రూపుమాపి, దివ్యత్వాన్ని ప్రసరింపజేసి పవిత్రతను దర్శనం గావింపచేసినవాడు కృష్ణుడు. అన్ని అవతారములు దివ్యమైనవే అయినప్పటికిని నవ్వుతూ నవ్వుతూ నిరంతరము నవ్వుతూ తన జీవితము అర్పితము గావిస్తూ వచ్చాడు. ప్రేమచేతనే అర్పితము గావించుకుంటూ వచ్చాడు. ఎలాంటి పరిస్థితియందైనను కోపమే లేదు. ఎప్పుడు నవ్వు నవ్వు. ఇది దైవముయొక్క ప్రధాన లక్షణము. అట్టి పవిత్రమైన గుణములు యిప్పుడు మాత్రమే కనిపిస్తున్నాయి. ఏ అవతారమందు కనిపించలేదు. అన్ని అవతారములందు ఆ దివ్యత్వము ఒక్కటే అయినప్పటికి కొన్ని కొన్ని పరిస్థితుల ప్రభావము పురస్కరించుకొని ప్రవర్తిస్తూ వచ్చారు. కానీ దైవత్వమును మనం హృదయపూర్వకంగా విశ్వసించాలి. నిన్ను నీవు ఏరీతిగా విశ్వసిస్తున్నావో ఆవిధంగా భగవంతుని విశ్వసించాలి. Faith in yourself and faith in God. This is the secret of greatness. నిన్ను నీవు ఏవిధంగా విశ్వసిస్తున్నావో అట్లనే భగవంతుని విశ్వసించాలి. నీవే దైవము, దైవమే నీవు. ఎందుకు సందేహాలకంతా అవకాశమునందిస్తున్నావు. ఈ సందేహము నీ దేహమునే ధ్వంసం చేస్తుంది. కనుక సందేహాల్ని దూరం చేసుకోండి. అనుమానాల్ని నిర్మూలంగావించుకోండి. ప్రేమతత్వాన్ని పెంచుకోండి. సత్య మార్గములో ప్రవేశించండి. దివ్యమైన తత్వాన్ని అనుభవించండి. ఇదియే నిజమైన సాధన. యిదియే నిజమైన ఆధ్యాత్మికము.

**(తేదీ 14-08-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam